క్లుప్తంగా

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



రైతులను సన్మానిస్తున్న ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: మండలంలోని తాడూర్ క్లస్టర్ రైతు వేదికలో శుక్రవారం వ్యవసాయ అధికారి సందీప్, ఉద్యాన వన శాఖ అధికారి ప్రవంతి ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ పడిగెల మానస మాట్లాడుతూ వాణిజ్య పంటలైన ఆయిల్‌పామ్ సాగువైపు రైతులు అడుగులు వేయాలని ప్రభుత్వం కూడా అనేక రాయితీలు కల్పిస్తోందని తెలిపారు. అనంతరం ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ముందుకు వచ్చిన పలువురు రైతులను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సురభి సరిత, ఎంపీటీసీ దుర్గాప్రసాద్, సిరిసిల్ల సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, ఏవో నరేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చిన పార్టీని ఆదరించండి



జెండా ఆవిష్కరిస్తున్నచీటి ఉమేశ్‌రావు

తంగళ్లపల్లి: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని పీసీసీ మాజీ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు అన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆసరి బాలరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. జిల్లెల్లలో డబుల్ బెడ్రూం ఇళ్లను ఎందుకు పంపిణీ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందిగా మారిన స్టోన్ క్రషర్‌ను మూసివేయిస్తాం అని అన్నారు. అనంతరం నూతనంగా నియామకమైన యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ, మండల నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి తిరుపతి, సంగీతం శ్రీనాథ్, చుక్క శేఖర్, ఏటీ యాదవ్, ఎడమల భూపాల్‌రెడ్డి, కటకము రాజశేఖర్, కొత్త రవి గౌడ్, ఎగుర్ల ప్రశాంత్, పడాల బాల్‌రాజు, పబ్బతి కృష్ణారెడ్డి, పున్నం తిరుపతి గౌడ్, నర్సింలు, అభిబ్, రాజు, కుమార్, సర్దార్, నరేందర్, కిషన్‌రెడ్డి, చందు, ప్రశాంత్, సాయి పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు



రైతులతో మాట్లాడుతున్న బాపురావు

ముస్తాబాద్: చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు అన్నారు. బంధనకల్‌లో కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో కాంటాలు ఆలస్యం కాకుండా చూస్తామన్నారు. ఇందుకు హమాలీలు సహకరించాలన్నారు.

వానకు తడుస్తూ..
ఎండకు ఎండుతూ..

- రోడ్డుపై కూరగాయల మార్కెట్
- ఇబ్బంది పడుతున్న క్రయ, విక్రయదారులు
- సమీకృత మార్కెట్ నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

గంభీరావుపేట: మీరు చూస్తున్న ఈ ఫొటో రోడ్డుకు ఇరువైపుల ఉన్న గంభీరావుపేట కూరగాయల మార్కెట్. ఈ మధ్య జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీగా కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డు తీసుకున్న ఈ గ్రామంలో మార్కెట్ పరిస్థితి ఇంత దారుణంగా ఉందంటే నమ్మశక్యంగా లేదు. ఒకవైపు సమీకృత మార్కెట్ భవనాలపై దృష్టిసారిస్తున్న ప్రభుత్వం ఈ మార్కెట్ అభివృద్ధి గురించి ఎందుకు పట్టించుకోవడం లేదో ఎవరికీ అర్థంకాని పరిస్థితి. పంచాయతీకి తైబజార్ పేరిట లక్షల ఆదాయం ఉన్న మార్కెట్ అభివృద్ధి చేయాలనే ఆలోచన పాలకవర్గానికి లేకపోవడం గమనార్హం.



రోడ్డుపై ఎండలో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

గంభీరావుపేట– నర్మాల ప్రధాన రహదారికి ఇరువైపులా ఈ మార్కెట్ క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. గంభీరావుపేట, నర్మాల, దేశాయిపేట, ముస్తఫానగర్, పొన్నాలపల్లె, జిల్లెల్లపల్లె, దమ్మన్నపేట, నాగంపేట, లింగన్నపేట తదితర గ్రామాల నుంచి ప్రజలు కూరగాయలు ఇతర నిత్యావసరాల కోసం ఇక్కడి మార్కెట్‌కు నిత్యం వస్తుంటారు. ఏళ్లుగా కొనసాగుతున్న ఈ మార్కెట్‌ను అభివృద్ధి చేయాలనే ఆలోచన ఎవరికి రాకపోవడం గమనార్హం. కూరగాయల విక్రయదారులు తాత్కాలికంగా ఎవరికివారే నీడ కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎండ వేడిమికి ఇటు కొనుగోలుదారులు, అటు విక్రయదారులు తల్లడిల్లిపోతున్నారు.

కనీస సౌకర్యాలు లేవు

మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయి. దూరప్రాంతాల నుంచి వచ్చేవారు తాగునీరు లేక దాహంతో అల్లాడిపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నడిచేందుకు వీల్లేకుండా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. గతంలో నిర్మించిన షెడ్లు అనుకూలంగా లేకపోవడంతో ఎవరు వాటిని వినియోగించడం లేదు. ఏటా రూ.వేలల్లో తైబజార్ ద్వారా గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరుతున్నా, మార్కెట్ అభివృద్ధి మాత్రం కావడం లేదు. బస్టాండ్‌లో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్‌ను వాడుకుంటున్నారు. మార్కెట్‌లో ప్రత్యేక టాయిలెట్స్‌గాని, తాగునీటి సౌకర్యాలుగాని లేవు.

రాకపోకలకు అంతరాయం

ప్రతి రోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 7 గంటల వరకు మార్కెట్ కొనసాగుతోంది. కూరగాయలతో పాటు నిత్యావసర వస్తువులు, సీజన్‌లో లభించే పండ్లు వంటివి మార్కెట్‌లో లభ్యమవుతుంటాయి. దీంతో నిత్యం వందలాది మంది మార్కెట్‌కు వస్తుంటారు. ప్రధాన రహదారిపైనే సంత కొనసాగుతుండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఆధునిక హంగులతో సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మించాలన్నది ఇక్కడి ప్రజల చిరకాల కోరిక. పాలకులు మారినా ప్రజల కోరిక మాత్రం నెరవేరడం లేదు. అయితే పాత గ్రామపంచాయతీ కార్యాలయ భవనం, పాత మార్కెట్ షెడ్లను తొలగించి, సమీకృత మార్కెట్ భవనం నిర్మించేందుకు ఇప్పుడిప్పుడే చర్యలు తీసుకుంటున్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



రోజువారీ మార్కెట్‌కు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విక్రయదారులకు నీడ కరువై ఇబ్బంది పడుతున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలి.
– మేకార్తి శ్రీనివాస్, గ్రామస్తుడు, గంభీరావుపేట

మార్కెట్‌ను ఆధునికీకరించాలి



చాలా ఏళ్ల నుంచి కూరగాయల మార్కెట్ గాంధీ ఏరియాలో కొనసాగుతోంది. ఇది అన్ని గ్రామాల ప్రజలకు అనుకూలంగా ఉంది. ఈ మార్కెట్‌ను ఆధునికీకరిస్తూ మౌలిక సదుపాయాలను కల్పించాలి. తాగడానికి నీటి సౌకర్యం, మూత్రశాలలు లేవు. మార్కెట్ అభివృద్ధిపై గ్రామపంచాయతీ ప్రత్యేక దృష్టిసారించాలి.
– రాగిశెట్టి నారాయణ, గ్రామస్తుడు, గంభీరావుపేట

త్వరలో సమీకృత మార్కెట్



త్వరలో అత్యాధునిక సదుపాయాలతో సమీకృత కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తాం. జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీగా ఎన్నికైన సందర్భంగా కేంద్రం అందించిన ప్రొత్సాహక నగదుతో మార్కెట్ రూపురేఖలు తీర్చిదిద్దుతాం. కొత్త మార్కెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూస్తాం.
– కటకం శ్రీధర్‌పంతులు, సర్పంచ్, గంభీరావుపేట

భిక్షాటన చేస్తూ నిరసన..



బోయినపల్లిలో భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న వీవోఏలు

బోయినపల్లి: వేతనాలు పెంచాలని కోరుతూ చేపడుతున్న సమ్మెలో భాగంగా వీవోఏలు మండల కేంద్రంలో శుక్రవారం భిక్షాటన చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు వీవోఏలు మాట్లాడుతూ తమ వేతనం పెంచాలని, ప్రమాద బీమా రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నియోజకవర్గ కోకన్వీనర్ ఉదారి నర్సింహచారి, మండలానికి చెందిన వీవోఏలు పాల్గొన్నారు.

ఎంపీపీ సంఘీభావం

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న వీవోఏలకు ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏల సమస్యలను ప్రభుత్వం తప్పకుండా పరిష్కారిస్తుందని, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ద్వారా వీవోఏల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని ఆయన తెలిపారు.

చిత్రకథ



మోరీ ఇలా.. నీరు వెళ్లేదెలా?

కోనరావుపేట మండలం మామిడిపల్లిలోని బస్టాండ్ ప్రాంతంలో ఉన్న మురుగునీటి కాలువ కూలిపోయి నెలలు గడుస్తున్నా సంబంధిత పాలకులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ నుంచి మూలవాగులోకి మురుగు నీరు వెళ్లే ఈ కాలువ నాణ్యతాలోపంతో కూలిపోయింది. దీంతో నీరు నిల్వ ఉండి పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. త్వరగా మరమ్మతు చేయాలని కోరుతున్నారు. - కోనరావుపేట

ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడంతోనే ప్రమాదాలు

- చందుర్తి ఎస్సై రమేశ్



మాట్లాడుతున్న ఎస్సై రమేశ్

చందుర్తి: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చందుర్తి ఎస్సై రమేశ్ పేర్కొన్నారు. కిష్టంపేటలో శుక్రవారం రాత్రి రోడ్డు భద్రత–ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఎస్సై రమేశ్ మాట్లాడుతూ నిర్లక్ష్యం, అతి వేగంగా వాహనాలు నడపవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం 20 నుంచి 30 సంవత్సరాల్లోపు యువకులే మరణిస్తున్నారన్నారు. బైక్‌లపై వెళ్లేటప్పుడు హెల్మెట్, కారులో సీటు బెల్ట్ తప్పకుండా ధరించాలని సూచించారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో దొరికితే శిక్ష తప్పదన్నారు. సర్పంచ్ నరేశ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులు రక్షణ చర్యలు తీసుకోవాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులు రక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసుల కార్యాలయంలో ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులకు వాటర్ బాటిల్స్, గొడుగులు, కూలింగ్ గాగుల్స్ అందించారు. బ్లూకోట్, పెట్రోకార్, ఇతర బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బంది తగు జాగ్రత్తలు పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐ యాదగిరి, ట్రాఫిక్ ఎస్ఐలు రాజు, దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

బోర్డులు మాయం

వీర్నపల్లి: మండలంలోని అడవి పదిర గ్రామంలో క్రీడలకు కోసం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం, వైకుంఠధామానికి సంబంధించిన బోర్డులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వీటిని గ్రామ సర్పంచ్ ఎడ్ల లక్ష్మీరాజం, కార్యదర్శి భానోత్ రాజు సిబ్బందితో కలిసి గురువారం ఏర్పాటు చేశారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలు

వీర్నపల్లి: మండలంలోని మోడల్ స్కూల్‌లో ఈ విద్యా సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థుల జాబితాను బోర్డుపై ఉంచినట్లు ప్రిన్సిపాల్ విశ్వనాథం తెలిపారు. అర్హత పరీక్ష రాసిన విద్యార్థులందరూ ప్రవేశాలకు అర్హులని తెలిపారు. విద్యార్థులు 5వ తరగతి ఉత్తీర్ణత, టీసీ, స్టడీ సర్టిఫికెట్, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు తీసుకురావాలన్నారు. పాస్‌పోర్టు సైజు ఫొటోలు, విద్యార్థి నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు.

నిరుద్యోగ డిక్లరేషన్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాలగం ప్రవీణ్(టోని) ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిరుద్యోగ డిక్లరేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టోని మాట్లాడుతూ ప్రోటోకాల్ పాటించని నాయకులను, కోవర్టు రాజకీయాలు చేసే లీడర్లను తరిమికొట్టాలి అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆడుకుంటుంది అని ఆరోపించారు. నిరుద్యోగుల ఆకాంక్షను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. దేశంలో ఐటీ రంగాన్ని ప్రవేశపెట్టిన యువతకు ఉపాధి చూపిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని రేపాక, సోమారంపేట, గొల్లపల్లి, తిప్పాపూర్, అనంతగిరి, ఇల్లంతకుంట, పత్తికుంటపల్లి, తాళ్లపల్లి, గాలిపల్లి, నర్సక్కపేట, జవారిపేట తదితర గ్రామాల్లో శుక్రవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేసి మాట్లాడారు. ఆడబిడ్డల పెళ్లి తల్లిదండ్రులకు భారం కావొద్దనే లక్ష్యంతో కల్యాణలక్ష్మి పథకానికి రూపకల్పన చేసి రూ.లక్ష 116 సాయం అందిస్తోందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ధాన్యం కొనుగోలుపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, లారీల సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఒక్కో కొనుగోలు కేంద్రానికి రోజు రెండు లారీల చొప్పున పంపాలని సూచించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను అంబరాన్నంటేలా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఐకేపీ ఆధ్వర్యంలో పలువురికి ట్రాక్టర్ పనిముట్లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు తిరుపతిరెడ్డి, అనంతరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడి, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో మీర్జా, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఆలయ నిర్మాణంపై సమావేశం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణంపై ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తుల సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ నంది కిషన్ తెలిపారు. ఆలయ నిర్మాణానికి టీటీడీ రూ.1.50 కోట్లు మంజూరు చేయగా, నిర్మాణ పనులపై ఉదయం 9 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. కరీంనగర్ వేద భవనం గురువు కల్వకుంట్ల వరప్రసాదాచార్యులు, గొల్లపల్లికి చెందిన రాచర్ల రఘురామశర్మ ఆలయ నిర్మాణం గురించి వైదిక సలహా, సూచనలు అందిస్తారన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ: పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ సుష్మ ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీపూర్, హన్మక్కపల్లి, లాలపల్లి, బాలానగర్, కోనాయపల్లి, భగవంతరావునగర్, చెక్కపల్లిరోడ్డు, పోలీస్‌స్టేషన్ ఏరియా, మున్సిపల్ ఏరియా, కాలేజ్ ఏరియా, భీమేశ్వరాలయం, పార్వతీపురం, బద్దిపోచమ్మ, రాజన్న గుడి ఏరియా, వేయిస్ రోడ్డు, అంజనీనగర్, విద్యానగర్, సాయినగర్, మల్లారం రోడ్డు, మార్కండేయనగర్, పాపన్నచౌక్, కట్ట కింది బస్టాండ్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

బోయినపల్లి: వేములవాడ మండలం మల్లారం 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మేయింటెనెన్స్‌లో భాగంగా మండలంలోని వెంకట్రావుపల్లి, బోయినపల్లి, విలాసాగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 16 గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సెస్ ఏఈ రంగు నగేశ్ తెలిపారు.

నియామకం

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జిగా దేవరాజు

సిరిసిల్లఅర్బన్: ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జిగా తంగళ్లపల్లి దేవరాజు మాదిగ నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు గోవిందుల నరేశ్ శుక్రవారం నియామక ఉత్తర్వులను జారీ చేశారు. అదే విధంగా నియోజవర్గ ఇన్‌చార్జిగా నెరెళ్ల శ్రీనివాస్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా సిరిసిల్లకు చెందిన దాసరి శ్రీనివాస్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అభినందించారు.

అంబేడ్కర్ సంఘం గ్రామ అధ్యక్షుడిగా రాజయ్య

తంగళ్లపల్లి: మండలంలోని చీర్లవంచ గ్రామ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడిగా మానువాడ రాజయ్య, ఉపాధ్యక్షుడిగా కురుమ పరుశ రాములు (సుమన్) ఎన్నికయి నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇరువురిని సర్పంచ్ జక్కుల రవీందర్, బీఆర్ఎస్ నాయకుడు జక్కుల నాగరాజు ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

ముగిసిన కంటివెలుగు కార్యక్రమం

ఇల్లంతకుంట: రెండో విడత కంటివెలుగు కార్యక్రమం జనవరి 19 నుంచి మే 26 వరకు మండలంలోని 33 గ్రామాల్లో 26,363 మందికి కంటి పరీక్షలు చేసినట్లు మండల వైద్యాధికారులు శరణ్య, రమేశ్ తెలిపారు. శుక్రవారంతో మండలంలో కంటివెలుగు కార్యక్రమం ముగిసినట్లు తెలిపారు.

ఉపాధిహామీ కూలీలకు డబ్బులు చెల్లించాలి

ఇల్లంతకుంట: ఉపాధిహామీ కూలీలకు పదిహేను రోజులకే వారి ఖాతాల్లో కూలీ డబ్బులు జమ చేయాల్సిన ప్రభుత్వం నెలల తరబడి పెండింగ్‌లో పెడుతుందని సీపీఐ మండల కార్యదర్శి సానవపెల్లి మల్లేశం అన్నారు. మండలంలోని తాళ్లపల్లిలో శుక్రవారం ఉపాధిహామీ పనులను పరిశీలించి మాట్లాడారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంట్లు, నీళ్లు ఏర్పాటు చేయాలన్నారు.

బస్వాపూర్‌లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో సిరిసిల్ల సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో శుక్రవారం ధాన్యం కొనుగోళ్లు ముగిసినట్లు రైతులు తెలిపారు.

పుస్తెమెట్టెలు పంపిణీ

ముస్తాబాద్: మండల కేంద్రంలో మూడురి యాదమ్మ ఎల్లయ్య దంపతుల కూతురు నందిని వివాహం సందర్భంగా ఎంపీపీ శరత్‌రావు పుస్తెమెట్టెలు శుక్రవారం అందించారు.

గాయపడ్డ ఫొటోగ్రాఫర్లకు చేయూత

ముస్తాబాద్: రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ ఇద్దరు ఫొటోగ్రాఫర్లు ముస్తాబాద్‌కు చెందిన మిరుదొడ్డి స్వామి, గూడూరుకు చెందిన జంపెల్లి తిరుపతికి తెలంగాణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోషియేషన్ శుక్రవారం రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందించింది. జిల్లా అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి, ముస్తాబాద్ మండలాధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరు

తంగళ్లపల్లి: మండలంలో 35 మంది లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. త్వరలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేస్తామని తెలిపారు.